క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి శివారులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను సోమవారం ఏపీఓ కుర్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని, రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనుల వద్ద కూలీలకు అవసరమగు అన్ని వసతులను నిబంధనల మేరకు కల్పించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి కూలీల ద్వారా చేపడుతున్న సాగునీటి కాల్వల మరమ్మతు, చెరువుల ద్వారా ఒండ్రు మట్టి తరలింపు పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

అప్పాయిపల్లి వాసికి డాక్టరేట్



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని అప్పాయిపల్లికి చెందిన వంగూరు నాగరాజు రాజనీతి శాస్త్రం విభాగంలో డాక్టరేట్ పొందాడు. పెబ్బేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నాగరాజు విధులు నిర్వహిస్తున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ పర్యవేక్షణలో వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ ఏ కేస్ స్టడీ ఆఫ్ మిషన్ కాకతీయ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ వచ్చినట్లు నాగరాజు తెలిపారు. అతడిని పలువురు అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కిష్టగిరిలో గొల్ల నక్క మాసన్న 25 గొర్రె పిల్లలను పంట పొలంలో ఉంచి గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. పంట పొలంలో ఉంచిన గొర్రె పిల్లలపై గ్రామంలోని కుక్కలు దాడి చేయడంతో మృతి చెందాయి. వీటి విలువ దాదాపు రూ. 1.5లక్షలు ఉంటుదని కాపారులు వాపోయారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించడంతో పాటు భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా గ్రామంలోని కుక్కలను అదుపు చేయాలని అధికారులను కోరారు.

ఆర్థికసాయం అందజేత



ఆత్మకూర్: ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయిన ఇంటి మరమ్మతు కోసం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని పిన్నంచర్లలో శనివారం కురిసిన వర్షానికి బోయ నరేష్ నివాస గృహం పాక్షికంగా దెబ్బతింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు బాధిత కుటుంబానికి వెళ్లి ఇంటి మరమ్మతు కోసం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనిల్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌భూపాల్, భీంరెడ్డి, రాంరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు.

దాతకు సన్మానం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామస్తులకు బొబ్బిటి కృష్ణారెడ్డి తన స్వంత ఖర్చులతో వ్యవసాయ బోరు నుంచి తాగునీటి తీసుకొచ్చి గ్రామస్తులకు సరఫరా చేశారు. ఈ సందర్భంగా దాతను గ్రామ పంచాయతీ కార్యదర్శి శర్మ, సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



హరితహారానికి మొక్కలు సిద్ధం

- వరుణుడి కోసం ఎదురుచూపు
- 2.80లక్షల మొక్కల పెంపకం

పెబ్బేరు రూరల్: హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాటు పూర్తి చేసింది. అందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీని ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచారు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు ప్రారంభమైతే జూన్, జులైలో మొక్కలు చాటేందుకు ప్రభుత్వం, ఆయా గ్రామ పంచాయతీల అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు.

28 పంచాయతీల పరిధిలో..

పెబ్బేరు మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రతి నర్సరీలో 10 వేల చొప్పున మొత్తం 2 లక్షల మొక్కలు, శ్రీరంగాపురం మండలంలోని 8 గ్రామ పంచాయతీల పరిధిలో 80 వేల మొక్కలను పెంచారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు వేసవి కాలంలో ఎండిపోకుండా బోర్లు, గ్రామ పంచాయతీ ట్రాక్టర్లు ద్వారా నీటిని అందించడంతో పాటు ఎండ నుంచి రక్షణగా గ్రీన్ నెట్ ఏర్పాటు చేశారు. అలాగే అందులో పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పకప్పుడు తొలగిస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీల్లో పండ్ల, పూలు, అటవీ మొక్కలు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. జామ, ఉసిరి, అల్లనేరేడు, చింత, మామిడి, సీతాపలం, దానిమ్మ, బాదం వంటి పండ్ల మొక్కలు నాటేందుకు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితో పాటు రోడ్లకు ఇరువైపులా నాటేందుకు టెకోమ వంటి మొక్కలు సిద్ధం చేశారు.



పెబ్బేరు శివారులో ఏర్పాటు చేసిన నర్సరీ

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఉమ్మడి మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 2.80లక్షల మొక్కలు సిద్ధం చేశాం. అందులో ప్రజలకు అవసరమైన పండ్లు, పూల మొక్కలను పెంచాం. వర్షాలు కురిసిన నాటి నుంచే గ్రామాల పరిధిలో కార్యాలయాలు, రోడ్డుకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటుతాం.

– రవీందర్, ఎంపీడీఓ, పెబ్బేరు

వీల్‌చైర్ అందించండి మహాప్రభో..



దివ్యాంగుడు గుండునాయక్



సదరం ధ్రువపత్రాన్ని చూపుతున్న దివ్యాంగురాలు శాంతమ్మ

పాన్‌గల్: నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వం అందించే వీల్ చైర్ లేకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన గుండునాయక్, శాంతమ్మ అనే ఇద్దరు దివ్యాంగులు నడవలేని స్థితిలో ఉన్నారు. వీరికి ఎవరైనా సాయం ఉంటే నడవడం, పనులు చేసుకోవడం చేస్తారు. వీరికి ఇంటి వద్ద ఎవరూ కుటుంబ సభ్యులు లేకపోవడంతో పనులు చేసుకోవడం ఇబ్బందిగా మారింది. గుండునాయక్ నేలపై పాకుతూ బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరిద్దరూ కూడా వీల్ చైర్ కోసం దివ్యాంగుల సంస్థకు దరఖాస్తు చేసుకున్నా.. ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీల్ చైర్ అందించి ఇబ్బందులు తొలగించాలని దివ్యాంగులు కోరుతున్నారు. దివ్యాంగులకు వీల్ చైర్లను అందించి ఇబ్బందులను తొలగించాలని తండా మాజీ సర్పంచ్ శాంతమ్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

చౌడేశ్వరిదేవికి పూజలు

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన చౌడేశ్వరిదేవి ఉత్సవాలకు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. భక్తులు బోనాలు, బండ్ల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు దామోదర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, లింగం, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



చౌడేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

ఇళ్ల మధ్య మురుగుతో ఇబ్బందులు



పట్టణంలోని శివాజీనగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో విషజ్వరాల బాధితుల సంఖ్య పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదు. వార్డుల్లో పారిశుద్ధ్యం లోపించి దోమలు, ఈగల సంఖ్య విపరీతంగా పెరుగుతుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికే 2, 3, 4, 5 వార్డుల్లో ప్రజలు గతేడాది డెంగీ జ్వరం ఇబ్బందులు పడ్డారు. అయినా ఆయా కాలనీల్లో పారిశుద్ధ్య పనులను చేపట్ట పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం అవగాహన సదస్సులను నిర్వహించడంతోనే సరిపెడుతున్నారని, స్థానికంగా ఉన్న డీఎంఆర్ఎం ఆస్పత్రిలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందట్లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు ఆర్ఎంపీ క్లినిక్‌లు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రిలో సూది మందులతో పాటు వైద్య సేవలు మెరుగుపర్చాలని కోరుతున్నారు.

విద్యుత్ అంతరాయం

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి ట్రాన్స్‌కో వారు రైల్వే సబ్‌స్టేషన్ కొత్త లైన్ల ఏర్పాటు పనులు చేపట్టనున్నట్లు జిల్లా ఏడీఏ సయ్యాద్ చిన్న మక్బుల్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మానవపాడు, శ్రీనగర్ గ్రామంలోని సబ్‌స్టేషన్ల పరిధిలో ఆయా గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు పునరుద్ధరించండి

మదనాపురం: మండలంలోని దుప్పల్లి, కొత్తపల్లి మీదుగా ఆత్మకూరు వెళ్లే షాద్‌నగర్ డిపో ఎక్స్‌ప్రెస్ బస్సును అధికారులు రద్దు చేయడం వల్ల హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం వేళల్లో హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయాణికులు నానాతంటాలు పడుతున్నారు. గతంలో కొన్నేళ్ల తరబడి ఈ రూట్‌లో నడిచిన ఈ బస్సు అర్ధాంతరంగా అధికారులు రద్దు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రద్దయిన బస్సును వెంటనే పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాల్వలో జమ్ము తొలగించాలి

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల ద్వారా ఉన్న భీమా కాల్వలో పేరుకుపోయిన జమ్మును తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కాల్వలో పేరుకుపోయిన జమ్ము, పూడిక మట్టితో చివరి ఆయకట్టు గ్రామాల రైతులకు సాగునీరు సక్రమంగా చేరక ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభానికి ముందుగానే కాల్వలకు మరమ్మతు చేపట్టి జమ్ము, పూడిక మట్టిని తొలగిస్తే రైతులకు సాగునీరు సక్రమంగా చేరుతుందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి భీమా కాల్వకు మరమ్మతు చేపట్టి రైతుల ఇబ్బందులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

అపరిశుభ్రంగా వాటర్‌ట్యాంక్‌లు

కోడేరు: మండల కేంద్రంలో తాగునీటి వాటర్ ట్యాంక్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని గ్రామస్తుల వాపోయారు. సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత గ్రామ ప్రత్యేక అధికారులు ఇప్పటి వరకు ట్యాంక్‌లను శుభ్రం చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషితం నీరు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి స్పందించి గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని సరాఫరా చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.

రెండు చోట్ల ఓట్లు వేసిన వారిపై ఫిర్యాదు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలం తూర్పుతండా రామగూడెం కు చెందిన రామస్వామి, లక్ష్మమ్మ, రవి అనే ముగ్గురు వ్యక్తులు మే 13న నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలల్లో తూర్పుతండా రామగూడెం, అచ్యుతాపురం రెండు గ్రామాల్లో ఓటర్లుగా నమోదు చేసుకొని, రెండు చోట్ల ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాలని అచ్యుతాపురం గ్రామానికి చెందిన సిల్‌మర్తి నరసింహ సోమవారం వనపర్తి కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తూర్పుతండా రామగూడెంకు చెందిన రామస్వామి, లక్ష్మమ్మ, రవి అచ్యుతాపురంలో ఓటరుగా నమోదు చేసుకున్నారని అతడు గతంలో అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు.

పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం

- గాంధీచౌక్‌లో పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేస్తాం
- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

వనపర్తి టౌన్: పట్టణ పరిశుభ్రతే ముఖ్యమని మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. పేదలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అత్యధికంగా సంచరించే గాంధీచౌక్‌లో గత పాలకులు పబ్లిక్ టాయిలెట్లు లేకుండా చేశారని మండిపడ్డారు. గతంలో పబ్లిక్ టాయిలెట్లు ఉన్న స్థలంలో మటన్ దుకాణాలు నిర్వహిస్తున్నారని, వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మటన్ మార్కెట్ వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా పాత బజార్‌లో డబ్బాలు ఏర్పాటు చేయిస్తామని, ఇప్పుడున్న గాంధీచౌక్ మటన్ మార్కెట్ స్థానంలో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తామన్నారు. నిత్యం వందలాది మంది సంచరించే గాంధీచౌక్‌లో పబ్లిక్ టాయిలెట్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ప్రయోజనార్థమే పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి చొరవ చూపుతున్నామని చెప్పారు. మరో మూడు రోజుల్లో పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు.



కాలనీ సమస్యలు వైస్ చైర్మన్‌కు వివరిస్తున్న ప్రజలు

మౌలిక వసతుల కల్పనకు వెనకాడం

పుర పరిధిలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. సోమవారం పుర కార్యాలయంలో 21వ వార్డుకు చెందిన నందిమల్ల గడ్డ వాసులు పుర కార్యాలయంలో వైస్ చైర్మన్ కలిసి సమస్యలు వివరించారు. నందిమల్ల గడ్డలో కొన్ని నెలల క్రితం తాగునీటి బోరు బావి మోటార్‌ను తొలగించారని, దీంతో కాలనీలో నీటి సమస్యకు తీవ్రమైందని వారు వివరించారు. అదేవిధంగా విద్యుత్ లైన్లు గజిబిజిగా ఉండటం, అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో వీధి దీపాలు లేక రాత్రి పూట ప్రజలు అవస్థలు పడుతున్నారని, సమస్యలు తీర్చాలని కోరారు. ఈ మేరకు స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ మాట్లాడుతూ.. పుర ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రెయినేజీలు, ఇతర అవసరాలను తీర్చేందుకు ముందుంటామని, విద్యుత్ లైన్ల ఏర్పాటు అంశం కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, కాలనీవాసులతో పాటుగా తన వంతుగా ఎమ్మెల్యేకు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు సహకరించాలని కోరుతానని చెప్పారు.

మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలి

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలని పాన్‌గల్ కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, బహుదూర్‌గూడెం ప్రాథమిక పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం వంటి పనులను నిబంధనల మేరకు చేపట్టాలన్నారు. పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, సీఆర్పీ గోవింద్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి

కౌన్సిలర్ రాధాకృష్ణకు ఘన నివాళి

వనపర్తి టౌన్: ఈనెల 13న మృతి చెందిన 31వ వార్డు కౌన్సిలర్ బండారు రాధాకృష్ణకు సోమవారం కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, నియోజకవర్గ సమన్వకర్త లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు, నాయకులు రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ బండారు రాధాకృష్ణ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, దిగులు చెందొద్దని రాధాకృష్ణ కుటుంబానికి భరోసానిచ్చారురు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, చీర్ల సత్యం, విభూతి నారాయణ, నందిమల్ల భువనేశ్వరి, నాయకులు రవియాదవ్, మధుగౌడ్, కృష్ణ బాబు, ఆదిత్య, శాంతన్న, సురేష్, శ్రీను ఉన్నారు.



రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముగిసిన వీరభద్రుడి ఉత్సవాలు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన వీరభద్రుడి 10వ వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయంలో స్వామివారి అభిషేకం, కుంకుమార్చన, భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారి సామూహిక కల్యాణ మహోత్సవం, నందికోళ్ల ఉత్సవాలు, వీరభద్రస్వామి విగ్రహ ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం, బండలాగుడు పోటీలకు ఆర్థికసాయం అందించిన దాతలకు, ఇతర కార్యక్రమాలకు సహకరించిన భక్తులందరికీ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జయరాములుసాగర్, కృష్ణయ్యసాగర్, కుమార్‌గౌడ్, గోవర్ధన్ సాగర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామి నందికోళ్ల సేవ ఊరేగింపు

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంగ్వాన్

పెబ్బేరు రూరల్: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ లోకల్‌బాడీ సంచిత్ సంగ్వాన్ అన్నారు. ఆయన వనపర్తి మండలంలోని అంకూర్‌లో సోమవారం హరితహారంలో నాటిన మొక్కలు, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, క్రిమిటోరియం పరిశీలించారు. హరితహారంలో భాగంగా నాటడానికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ ఉన్న జీపీ రికార్డులను అప్డేట్ చేసుకోవాలని తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రఘునాథరెడ్డి, ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ సుదర్శన్, కార్యదర్శి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: గ్రామాల్లో నర్సరీలపై గ్రామ పంచాయతీ సెక్రటరీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని తూర్పు గార్లపాడులో ఆయన నర్సరీని పరిశీలిచి అనంతరం రాజోళి మండల కేంద్రంలో పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. 2022–23 కు సంబంధించిన నర్సరీల వివరాలపై చర్చించి, రానున్న రోజుల్లో నర్సరీల్లో చేపట్టాల్సిన పనులపై మాట్లాడారు. నర్సరీల్లో ఉన్న సిబ్బంది చేయాల్సిన విధులపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, సెక్రటరీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల పరిశీలన



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, మానవపాడు గ్రామాలలో సోమవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలోని మొక్కలకు నీటి సదుపాయం మొక్కలకు అందించాలని సూచించారు. వైకుంఠదామం, సెగ్రిగేషన్‌షెడ్, నర్సరీలలో పనులను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎరువులను తయారీ చేయాలని తెలిపారు. నర్సరీలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పరిష్కారం



పెద్దకొత్తపల్లి: ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు పరిష్కారం చేసుకోవచ్చని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని వెనచర్లలో రెవెన్యూ అధికారులు ధరణి సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈసూప్‌అలీ, ఆర్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

కొల్లాపూర్: పట్టణంలోని 19వ వార్డులో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణాలను వార్డు కౌన్సిలర్ శ్రీదేవీ గౌతంగౌడ్ పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రోడ్డుపై విరిగి పడిన చెట్టు



బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలో సోమవారం వీచిన ఈదురు గాలులకు జడ్చర్ల, తిమ్మాజిపేట ప్రధాన రహదారిపై ఓ చెట్టు విరిగిపడింది. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేందర్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు.

బహుమతుల ప్రదానం

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో నిర్వహించిన కబడ్డీ విజేతలకు సోమవారం సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. పైపాడులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి శాంతినగర్ జట్టు, ద్వితీయ బహుమతి ప్యాపిలి, తృతీయ బహుమతి పంచలింగాల జట్లు కైవసం చేసుకున్నాయి. మొదటి బహుమతి వడ్డేపల్లి మాజీ జెడ్పీటీసీ రూ.30,016 వేలు, రెండో బహుమతి చరణ్ రూ.20,016 వేలు, మూడో బహుమతి ఆర్.భీమిరెడ్డి రూ.10,016 నగదు అందజేశారు.